సాక్షి
కాకినాడ
మంగళవారం । 23 । జూలై । 2024



పెళ్లి సందడికి రెడీ


అన్నవరం దేవస్థానంలో వచ్చే నెలలో భారీగా వివాహాలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే సత్రం గదులు, మండపాలకు డిమాండ్ ఏర్పడింది. - 8లో▸



అంతకంతకూ తగ్గుతూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కర్ర పెండలం సాగు అంతకంతకూ తగ్గుతుంది. సాగులో లాభాలు రాక ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. - 8లో▸

డెల్టాలకు 2,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. సముద్రంలోకి 12,05,126 క్యూసెక్కులు విడిచి పెట్టారు.

న్యూస్‌రీల్

పంపా ఆయకట్టుకు నీటి విడుదల



పంపా కాలువలోకి విడుదలవుతున్న నీరు

అన్నవరం: పంపా ఆయకట్టుకు సోమవారం సాగు నీరు విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు తొలుత రైతు నాయకులు నదికి పూజలు చేసి, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. అనంతరం స్లూయిజ్ గేట్లు ఎత్తే చక్రం తిప్పి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా దీనిని పెంచుతామని జలవనరుల శాఖ పెద్దాపురం డివిజన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఈ ఏడాది పూర్తి ఆయకట్టు 12,500 ఎకరాలకూ సాగునీరు అందిస్తామని చెప్పారు. పంపా కాలువల్లో ప్రవాహానికి అక్కడక్కడ అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, పూడిక తొలగిస్తామని తెలిపారు. పంపా రిజర్వాయర్ నీటి మట్టం 96 అడుగులకు చేరింది. ఆయకట్టుకు 20 క్యూసెక్కులు విడుదల చేస్తూండగా రిజర్వాయర్ లోనికి 50 క్యూసెక్కులు వస్తోందని ఈఈ తెలిపారు. అందువలన నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

కలెక్టరేట్‌కు 221 అర్జీలు



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి (గ్రీవెన్స్ సెల్) జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 221 మంది అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా అధికారులతో కలసి కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో ఇళ్లు, నివేశన స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, మురుగు కాలువల్లో పూడికల తొలగింపు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చిన అర్జీలకు సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ వారం రోజులూ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. క్లీన్ కాకినాడ జిల్లా కావాలని, అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఈ కార్యక్రమాలు విధిగా నిర్వహించి, ప్రతి రోజూ నివేదికలు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌండా) వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, సీపీఓ పి.త్రినాథ్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు.. కాస్త శాంతించాడు



సామర్లకోట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు

- ఏకధాటి వానకు తెరిపి
- మోస్తరు జల్లులతో సరి
- వాగులకు జలకళ

కాకినాడ సిటీ: వరుణుడు కాస్త శాంతించినట్లున్నాడు. అల్పపీడనం ప్రభావంతో ఐదు రోజులుగా ఏకధాటిగా కురిపించిన వర్షాలకు సోమవారం కాస్త విరామం ఇచ్చాడు. జిల్లా వ్యాప్తంగా వాతావరణం మబ్బు పట్టినప్పటికీ అక్కడక్కడ మోస్తరు జల్లులు మాత్రమే కురిశాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకూ 28.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రోజుల తరబడి కురిసిన వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. జిల్లాలోని ఏలేశ్వరం, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, తుని, శంఖవరం తదితర ప్రాంతాల్లోని వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. తాళ్లరేవు మండలం గోవలంక, గోపులంక, పిల్లంక తదితర ప్రాంతాల్లోకి గోదావరి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఆయా మండలాల అధికారులు సూచిస్తున్నారు. రోజువారీ కార్యకలాపాలకు సైతం నదీ తీరం దరిదాపుల్లోకి వెళ్లరాదని అవగాహన కల్పిస్తున్నారు.

పంటల పరిశీలన

వానలు కాస్త తెరిపివ్వడంతో ముంపునకు గురైన వరి చేలను పరిశీలించేందుకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వెదజల్లు సాగు, నాట్లు వేసిన వరి చేలతో పాటు నారుమళ్లు ముంపుబారిన పడటంతో నష్టాలు అంచనా వేసేందుకు శ్రీకారం చుట్టారు. పంట పొలాల్లో చేరిన నీటిని రైతులు తొలగిస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులు వ్యవసాయ పనులకు ఉపక్రమించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 62,500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. దాదాపు 5,200 ఎకరాల్లో వరి నాట్లు, వెద జల్లు సాగు వేసిన పంట నీటిలో మునిగి దెబ్బ తిన్నాయని వ్యవసాయాధికారులు గుర్తించారు.

ఉధృతంగా ఏలేరు

సామర్లకోట: ప్రాజెక్టు నుంచి జలాలు విడుదల చేస్తూండటంతో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సామర్లకోట సమీపంలోని ఉప్పువారి సత్రం వద్ద పంట భూములు నీటిలో మునిగిపోయాయి. ఉప్పువారి సత్రం నుంచి ఐదు తూములు, వీకే రాయపురం మీదుగా ఏలేరు జలాలు సముద్రంలోకి ప్రవహిస్తున్నాయి. ఏలేరు ఉధృతికి వీకే రాయపురం వద్ద కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ట్రాక్టర్లను పొలాలకు తీసుకుని వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఏలేరు కాలువపై ఉన్న కాలిబాట వంతెన మీదుగా రైతులు కాలినడకన, మోటార్ సైకిళ్లపై పొలాలకు వెళుతున్నారు.

తాండవ పరవళ్లు

తుని రూరల్: పరివాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వచ్చి చేరుతున్న వరద నీటితో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తునికి ఎగువన, దిగువన తాండవ నదిపై నిర్మించిన మినీ రిజర్వాయర్లు (భూమి, ముతా కాలువలు) పైనుంచి వరద నీరు సముద్రం వైపు పరవళ్లు తొక్కుతోంది. ఈ రెండు మినీ రిజర్వాయర్ల కుడి, ఎడమ కాలువల నుంచి తుని, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలాల్లోని పది వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు సాగునీరు అందించే ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా పెరిగాయి. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, 368.5 అడుగులకు చేరింది. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు కాగా, 96 అడుగులకు చేరింది. పరివాహక ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం రాత్రికి నీటి నిల్వలు మరింతగా చేరుతాయని ఆయా ప్రాజెక్టుల అధికారులు తెలిపారు. ఇదేవిధంగా వరద నీరు చేరితే ఈ ఏడాది ఖరీఫ్‌లో వరికి సాగునీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు అంటున్నారు.



తుని మినీ రిజర్వాయర్ల వద్ద తాండవ పరవళ్లు

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
కోటనందూరు	39.2
జగ్గంపేట	36.6
ఏలేశ్వరం	36.4
గండేపల్లి	35.8
తుని	35.5
యు.కొత్తపల్లి	32.6
రౌతులపూడి	32.0
పెద్దాపురం	30.6
శంఖవరం	30.2
పిఠాపురం	29.4
కిర్లంపూడి	28.4
సామర్లకోట	28.4
కాకినాడ రూరల్	26.4
ప్రత్తిపాడు	24.8
తొండంగి	24.4
పెదపూడి	21.4
కాకినాడ అర్బన్	18.8
కరప	18.2
తాళ్లరేవు	16.8
కాజులూరు	13.2

అభాగ్య బాలల చదువులకు స్పాన్సర్‌షిప్ పథకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: జిల్లావ్యాప్తంగా అనాథ, పాక్షిక అనాథ, హెచ్ఐవీ ప్రభావిత బాలబాలికలతో పాటు కోవిడ్‌తో పాక్షిక అనాథలుగా మారిన 417 మందిని స్పాన్సర్‌షిప్ పథకానికి తాత్కాలిక ప్రాతిపదికన ఎంపిక చేశారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఈ విషయం తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పాన్సర్‌షిప్, పోస్టల్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బాలలందరూ ఇంటి వాతావరణంలో చక్కగా చదువుకోవడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు జె.సంతోషి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, ఉమా మనోవికాస కేంద్రం ప్రతినిధి ఎస్‌పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై 'డాక్ చౌపల్స్'

రేపటి నుంచి అవగాహన కార్యక్రమాలు

అమలాపురం టౌన్: పోస్టల్ శాఖ వినియోగదారులకు అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'డాక్ చౌపల్స్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం సోమవారం ఈ విషయం తెలిపారు. తమ డివిజన్‌లో ఈ కార్యక్రమాన్ని బుధవారం నుంచి అమలు చేస్తామన్నారు. ఆ రోజు నుంచి పోస్టల్ డివిజన్ పరిధిలోని రాజోలు ప్రధాన పోస్టాఫీస్, అయినవిల్లి మండలం విలస సబ్ పోస్టాఫీస్‌లో డాక్ చౌపల్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. దీని ద్వారా పోస్టల్ శాఖ అందిస్తున్న అన్ని సేవలు, పథకాల గురించి అధికారులు, సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. యువత విధిగా పాల్గొనేలా కేంద్ర కమ్యూనికేషన్స్, యువజన వ్యవహారాల శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించాయని వివరించారు. ఇదే సమయంలో ఈ నెల 24వ తేదీ నుంచి పై రెండు పోస్టాఫీసుల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కూడా ఉంటుందన్నారు. వివరాలకు 08856 – 231380 ఫోన్ నంబరులో సంప్రదించాలని శ్రీధరం సూచించారు.

హుండీ ఆదాయం రూ.28.80 లక్షలు



అప్పనపల్లిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లిలోని శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 54 రోజులకు గాను హుండీల ద్వారా రూ.28,80,990 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. హుండీల్లో 1.500 గ్రాముల బంగారం, 93 గ్రాముల వెండి లభించిందని ఈఓ తెలిపారు. సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కుష్ఠుపై సమరం

- నిర్మూలనే లక్ష్యం
- జిల్లాలో ప్రారంభమైన సర్వే వచ్చే నెల 2 వరకూ ఇంటింటా నిర్వహణ

కాకినాడ సిటీ: ఇప్పటికీ చాలా మందికి కుష్ఠు వ్యాధిగ్రస్తులంటే అదో రకమైన భయం. వారికి వచ్చిన వ్యాధి మనకూ అంటుకుంటుందని ఆందోళన. దీంతో ఈ వ్యాధిగ్రస్తులు కనిపిస్తే చాలు.. దూరం జరిగిపోతూంటారు. వారిపై వివక్ష పాటిస్తారు. అయితే, ప్రస్తుతం కుష్ఠు పేరు వినగానే భయపడే రోజులు పోయాయి. దాని నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటూండటంతో గతంతో పోల్చితే బాధితుల సంఖ్య బాగా తగ్గింది. మిగిలిన కొద్ది శాతాన్ని కూడా అరికట్టి, ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ నెల 18న ప్రారంభమైన ఈ సర్వే వచ్చే నెల రెండో తేదీ వరకూ జరగనుంది. జిల్లాలో 22,47,86 జనాభా ఉండగా.. వైద్య, ఆరోగ్య సిబ్బంది సోమవారం వరకూ 1,16,618 ఇళ్లను సందర్శించి, 5,52,710 మందిని పరీక్షించారు. సోమవారం వరకూ ఇందులో భాగంగా వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడం, వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే మందులు పంపిణీ చేసి, వాడించడం, తగ్గే వరకూ పర్యవేక్షించడం తదితర కార్యక్రమాలను పక్కాగా అమలు చేయనున్నారు.

గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకూ జిల్లాలో కుష్ఠు కేసుల వివరాలు

నమోదైన కేసులు	82
మహిళలు	29
చిన్నారులు	4
వివిధ రకాల చర్మవ్యాధిగ్రస్తులు	2,782
బహుళ అంగవైకల్యంతో రూ.6 వేల పెన్షన్ పొందుతున్న వారు	507

- జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం, కాట్రావులపల్లి, తుని ప్రాంతాల్లో ప్రభుత్వ లెప్రసీ కాలనీలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం 69 మంది వ్యాధిగ్రస్తులున్నారు.

ఇవీ వ్యాధి లక్షణాలు

హాన్సెన్స్ వ్యాధిగా పిలిచే కుష్ఠు.. మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. ఈ సూక్ష్మక్రిమి ప్రధానంగా చర్మంపై ప్రభావం చూపుతుంది. అలాగే, మెదడు, వెన్నుపాము వెలుపల ఉన్న నరాలను ప్రభావితం చేస్తుంది. కళ్లు, ముక్కు లోపల ఈ బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. కుష్ఠులో ట్యూబర్‌కులోయిడ్ లెప్రసీ, లెప్రోమాటస్ లెప్రసీ, బోర్డర్ లైన్ లెప్రసీ, పాసి బాసిల్లరి, మల్టీ బాసిల్లరీ వంటివి ఉన్నాయి.



కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

- చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు.
- చెవులపై బుడిపెలు, కంతులు, నరాల తిమ్మిర్లు.
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం (చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలా ఉండటం).
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం.
- కనురెప్పలు మూత పడకపోవడం.
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం.
- అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం.
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, పుండ్లు పడటం.
- చేతి, కాలి వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం.

చికిత్స అందిస్తారిలా..

కుష్ఠు రోగి తుమ్మడం, దగ్గడం ద్వారా ఈ వ్యాధి కారక క్రిములు వ్యాప్తి చెందుతాయి. కుష్ఠు వ్యాధి కేసు బయటపడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో వైద్య బృందం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుంది. కేసు బయటపడిన ఇంట్లోని వారందరికీ కుష్ఠు లేకపోయినా ముందు జాగ్రత్తగా మందులు వాడిస్తారు. వ్యాధిగ్రస్తుని శరీరంలో పాసి బాసిల్లై (తక్కువ స్థాయిలో లెప్రసీ క్రిములు) ఉంటే 6 నెలలు, మల్టీ బాసిల్లై (అధిక శాతం లెప్రసీ క్రిములు) ఉంటే 9 నెలల పాటు మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) మందులు ఉచితంగా అందజేస్తారు. ఆ శాఖ అధికారుల సిఫారసు మేరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులతో పాటు బహుళ అంగవైకల్యం ఉన్న వారికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.6 వేల చొప్పున పింఛన్ అందిస్తోంది.

కుష్ఠు రహితం చేసేందుకు కృషి



జిల్లాను కుష్ఠు రహితంగా మార్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది. వైద్య బృందాలు ప్రతి ఇంటికీ, పాఠశాలలకు వెళ్లి కుష్ఠుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి, కాకినాడ

నమ్మండి.. నో స్టోరేజ్

- అలంకారప్రాయంగా ఫ్లడ్ స్టోరేజ్‌లు
- వరద నియంత్రణ సామగ్రి అంతంత మాత్రమే
- ఉమ్మడి జిల్లాలో 36 చోట్లా అదే పరిస్థితి
- శిథిలావస్థకు చేసిన భవనాలు

సాక్షి, అమలాపురం: డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే గోదావరి అప్పుడప్పుడూ కన్నెర్ర చేస్తోంది. నిలకడగా.. నిశ్చలంగా ప్రవహించే నది ఉగ్ర రూపం దాల్చుతోంది. పాడి పరిశ్రమ, పంటలకు ఆలవాలంగా ఉండే గోదావరి వరద పోటెత్తి పల్లెలనూ ముంచెత్తుతోంది. గోదావరి మధ్యన.. ఏటిగట్లను ఆనుకుని ఉండే లంక గ్రామాలే కాకుండా.. గట్లనూ తెంచుకుని డెల్టా ప్రాంతాలపై కూడా పడుతోంది. దశాబ్దాల చరిత్రలో ఇటువంటి విషాదకరమైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ కారణంగానే గోదావరికి వరదలు వచ్చే సమయంలో ఏటిగట్ల పరిరక్షణ జలవనరుల శాఖ అధికారులకు కత్తిమీద సామే. అప్పట్లో వీరికి ఫ్లడ్ స్టోరేజ్‌లు, వాటి వద్ద వరద నియంత్రణకు సిద్ధంగా ఉంచిన సామగ్రి అక్కరకు వచ్చేది. ఒకప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు ఏటిగట్లు చాలావరకూ పటిష్టంగా ఉండడం.. రవాణా వ్యవస్థ మెరుగుపడడంతో వీటి అవసరం తగ్గింది. దీనిని సాకుగా చూపి ఫ్లడ్ స్టోరేజ్ ఆలనాపాలనను ఇరిగేషన్ అధికారులు గాలికి వదిలేశారు. ఈ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో పాటు ఇక్కడ పూర్తి స్థాయిలో సామగ్రిని అందుబాటులో ఉంచడం లేదు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన వెంటనే గోదావరి ఏటిగట్ల మీదకు అధికారులు చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ స్టోరేజ్‌ల నుంచి ఏటిగట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద వరదనీరు లీకవకుండా.. గట్లకు గండ్లు పడకుండా సర్వే బాదులు, ఇసుక, ఇసుక బస్తాలు తెచ్చుకునేవారు. ఉమ్మడి జిల్లాలో 36 వరకూ ఫ్లడ్ స్టోరేజ్‌లు ఉన్నాయి. ఇందులో సెంట్రల్ ఫ్లడ్ స్టోరేజ్‌లు ఆరు కాగా, పర్మినెంట్‌వి 15 వరకూ ఉన్నాయి. వరదల సమయంలో తాత్కాలికంగా 14 అడిషనల్ ఫ్లడ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అన్ని రకాల ఫ్లడ్ స్టోరేజ్‌లు ఏడు వరకూ ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 26, కాకినాడ జిల్లాలో మూడు వరకూ ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాల పరిధిలో గోదావరి, గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, కోరంగి నదులు సుమారు 260.80 కిలోమీటర్లు. వీటికి రక్షణగా నిర్మించిన ఏటిగట్టు పొడవు 535 కిలోమీటర్లు ఇందులో బ్యారేజీ ఎగువన అఖండ గోదావరి కుడి, ఎడమల ఏటిగట్లు పొడవు 83.73 కిలోమీటర్లు కాగా, గౌతమీ కుడి, ఎడమల ఏటిగట్టు, కోరింగ ప్రాజెక్టు ఫ్లడ్ బ్యాంకులు కలిపి 204.70 కి.మీల పొడవు ఉంటాయి. వశిష్ఠ, వైనతేయ కుడి, ఎడమల ఏటిగట్టు పొడవు 246.30 కిలోమీటర్లు. వీటి రక్షణ కోసం ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే 36 ఫ్లడ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్లడ్ స్టోరేజ్‌లు

సెంట్రల్ ఫ్లడ్ స్టోర్స్

- అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంకు: రాజమహేంద్రవరం
- గౌతమీ లెఫ్ట్ బ్యాంకు: కపిలేశ్వరపురం, కోటిపల్లి
- గౌతమీ రైట్ బ్యాంకు: ర్యాలి, అన్నంపల్లి
- పీపీపీ (ఐ.పోలవరం): మురమళ్ల
- వశిష్ఠ లెఫ్ట్ బ్యాంకు: రాజోలు

పర్మినెంట్ ఫ్లడ్ స్టోర్స్

- అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంకు: ధవళేశ్వరం, ముగ్గళ్ల
- గౌతమీ లెఫ్ట్ బ్యాంకు: వేమగిరి, కపిలేశ్వరపురం, మసకపల్లి
- కోరంగి ఐలెండ్ ప్రాజెక్టు: తాళ్లరేవు (నీలపల్లి)
- గౌతమీ రైట్ బ్యాంకు: పేరవరం, మెర్లపాలెం, చింతనలంక
- వశిష్ఠ లెఫ్ట్ బ్యాంకు: కట్టుంగ, గోపాలపురం, సఖినేటిపల్లి
- వైనతేయ లెఫ్ట్ బ్యాంకు: పి.గన్నవరం
- వైనతేయ రైట్ బ్యాంకు: పాశర్లపూడి
- వైనతేయ లెఫ్ట్ బ్యాంకు: బోడసకుర్రు



పి.గన్నవరంలో శిథిలావస్థకు చేరిన పర్మినెంట్ ఫ్లడ్ స్టోరేజ్

అడిషనల్ ఫ్లడ్ స్టోర్స్

- అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంకు: వెంకటనగరం, వంగలపూడి, పురుషోత్తపట్నం
- గౌతమీ లెఫ్ట్ బ్యాంకు: ఆలమూరు
- గౌతమీ రైట్ బ్యాంకు: వానపల్లి, పల్లంకుర్రు, రావులపాలెం, పీపీపీ ఎదుర్లంక
- వశిష్ఠ లెఫ్ట్ బ్యాంకు: నాగుల్లంక, రాజవరం, పొడగట్లపల్లి
- వైనతేయ లెఫ్ట్ బ్యాంకు: కతారులంక, కోరంగి ఐలాండ్ ప్రాజెక్టు కాకినాడ, నీలపల్లి

మంచి చేసిన మహానేత

2006 భారీ వరదలకు నష్టాన్ని స్వయంగా చూసిన నాటి ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ఏటిగట్ల ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకూ 85 శాతం గట్ల పటిష్ట పనులు జరిగాయి. భూసేకరణ, కోర్టు కేసుల కారణంగా మరికొన్ని చోట్ల నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. గట్లను 1986 వరదల ప్రామాణికంగా తీసుకుని పటిష్టం చేశారు. సుమారు 40 లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా దీని నిర్మాణం జరిగింది. వీటిపై అఖండ గోదావరి గట్ల మీద పురుషోత్తపట్నం, పోలవరం, దిగువన జొన్నాడ నుంచి యానాం, విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం, పి.గన్నవరం నుంచి బోడసకుర్రు వరకూ ఇలా పలుచోట్ల బీటీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు జరిగాయి. వరదల సమయంలో గట్ల పరిరక్షణకు అవసరమైన సామగ్రి తరలించేందుకు మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పడింది. ఈ కారణంగా ఫ్లడ్ స్టోరేజ్‌లపై భారం తగ్గింది. అయినప్పటికీ నిబంధనల మేరకు ఇక్కడ అవసరమైన సామగ్రి అంతా అందుబాటులో ఉంచాలి. ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే అవి ఉపయోగపడతాయి. కానీ అధికారులు వీటి వంక చూడడం లేదు. వరదల సమయంలో కొద్దిపాటి సామగ్రి తెచ్చి హడావుడి చేస్తున్నారనే విమర్శలు వెల్లివెత్తుతున్నాయి.



ఆత్రేయపురం మండలం ర్యాలి వద్ద సెంట్రల్ ఫ్లడ్ స్టోరేజ్‌లో తక్కువ మొత్తంలో సర్వే బాదులు

సెంట్రల్ ఫ్లడ్ బ్యాంకులో సామగ్రి ఇలా..

మెటీరియల్	సెంట్రల్	పర్మినెంట్	అడిషనల్
ఖాళీ సిమెంట్ బ్యాగులు	40 వేలు	2 వేలు	2 వేలు
సర్వే బాదులు	2 వేలు	నిల్	నిల్
వెదురుగెడలు	వెయ్యి	800	200
ఇసుక	300 సీఎం	300	170
పురుకోస	23 కిలోలు	4.5 కిలోలు	4.5 కిలోలు
డొక్కతాడు	90 కిలోలు	90 కిలోలు	నిల్
టార్చిలైట్లు	18	18	నిల్

క్లుప్తంగా

బాలలకు నాణ్యమైన విద్య అందాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: ప్రతి గ్రామంలో బాలలకు నాణ్యమైన విద్య అందించేలా అధికారులు కృషి చేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక శిక్షణ కేంద్రంలో 11 జిల్లాల్లోని జిల్లా పరిషత్తు, డీపీఓ, డ్వామా, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమ శాఖ, మెడికల్ అండ్ హెల్త్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖల్లోని అధికారులకు మూడు రోజుల పాటు నిర్వహించే రెండో బ్యాచ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని నిర్ణయించిందని ఆయన అన్నారు. ఈ మేరకు తొమ్మిది లక్ష్యాలను గుర్తించి మూడు అంశాలపై స్థానిక శిక్షణ కేంద్రంలో 11 జిల్లాల్లోని అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దేశ భవితను తీర్చిదిద్దే పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత అంతా తీసుకోవాలన్నారు. చిన్న పిల్లల కోసం బాల విహార్ నిర్వహించాలని, అందులో అన్ని మతాల గ్రంథాలు, ఇతిహాసాలు, కథలు వినిపించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు జీఎస్ శ్రీదేవి, కె.నిహారిక, పి.శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావులు శిక్షణ ఇచ్చారు. బుధవారంతో శిక్షణ ముగుస్తోంది. గురువారం నుంచి మూడో బ్యాచ్‌కు తాగు నీటి సమస్య లేని గ్రామం అనే అంశంపై శిక్షణ ఉంటుంది.

టీచ్ టూల్ విధానాలకు అనుగుణంగా బోధన



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ కమలకుమారి

అమలాపురం టౌన్: ఇక నుంచి టీచ్ టూల్ విధి విధానాలకు అనుసరించి పాఠ్యాంశాల బోధన సాగాలని డీఈఓ ఎం.కమలకుమారి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా టీచ్ టూల్‌పై డివిజన్‌లోని ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ విధానంలో ఉపాధ్యాయుల బోధనతోపాటు విద్యార్థులకు ఆ పాఠ్యాంశాలపై అవగాహన, పరిశీలన కచ్చితంగా ఉండాలని డీఈఓ అన్నారు. శిక్షణకు సంబంధించి కో ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణ, దుర్గాదేవిలతో డీఈఓ మాట్లాడి శిక్షణ సాగుతున్న తీరుపై చర్చించారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ఎం.శ్రీనుబాబు, రిసోర్స్ పర్సన్లు వివేక్, హిమబిందు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సందడికి రెడీ

- శ్రావణమాస వివాహాలకు సన్నాహాలు
- వచ్చే నెల నుంచి రత్నగిరికి మళ్లీ కళ
- మూడు నెలల విరామం తర్వాత మొదలు
- సత్రం గదులు, మండపాలకు డిమాండ్

అన్నవరం: వేద మంత్రాల సాక్షిగా.. మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రబద్ధంగా జరిగే వివాహాలకు అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధి ప్రసిద్ధి. స్వామివారి దేవస్థానం సుమారు మూడు నెలల విరామం తర్వాత తిరిగి నవ దంపతులతో కళకళలాడనుంది. శుభ కార్యాలకు దివ్యమైన మాసంగా పేరొందిన శ్రావణమాసం వచ్చే నెల ఐదో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఏడో తేదీ శ్రావణ శుద్ధ చవితి నుంచి వివాహాలు జరగనున్నాయి. ఆ నెల 23వ తేదీ వరకూ వివాహ ముహూర్తాలు ఉన్నాయని పండితులు తెలిపారు.

మొదలైన హడావుడి

సుమారు మూడు నెలల విరామం తర్వాత ఆగస్టు ఏడో తేదీ నుంచి వివాహాలు మొదలవుతుండటంతో దేవస్థానంలోని సత్రం గదులు, వివాహ మండపాలు అద్దెకిచ్చే సీఆర్వో కార్యాలయం వద్ద, ఉచిత కల్యాణ మండపాలు వద్ద పెళ్లి బృందాల సందడి నెలకొంది. సత్రం గదులు, కల్యాణ మండపాల రిజర్వేషన్ కోసం వారు దేవస్థానంలోని సీఆర్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. నెల రోజుల ముందు నుంచీ మండపాలు, సత్రం గదుల రిజర్వేషన్ ప్రారంభమవుతోంది. అదే విధంగా క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి మేళాలకు గిరాకీ పెరిగింది.

600 పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా

శ్రావణ మాసం వివాహాల సీజన్ కావడంతో రత్నగిరిపై సుమారు 600 పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది ఏప్రిల్‌లో వచ్చే చైత్రశుద్ధ నవమి (శ్రీరామ నవమి) అనంతరం వివాహాది శుభకార్యాలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత మే నెల, వైశాఖ మాసం వేసవి అయినప్పటికీ వాతావరణం వివాహ వేడుకలకు ఎటువంటి అవాంతరం ఉండదు. అందుకే ఎక్కువగా జరుగుతాయి. ఈ ఏడాది వైశాఖమాసం అంతా మూఢం రావడంతో చాలా మంది వివాహాలను వాయిదా వేసుకున్నారు. వచ్చే నెల ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల నుంచి 23వ తేదీ వరకూ వివాహాలు జరగనున్నాయి. ఇందులో 15, 18, 22, 23 తేదీల్లో దివ్యమైన ముహూర్తాలు ఉండడంతో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉందని పండితులు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సత్రం గదులకు రిజర్వేషన్

వివాహాల కోసం సత్రాల్లో 60 శాతం వరకూ గదులను పెళ్లి బృందాలకు అధికారులు రిజర్వ్ చేస్తున్నారు. మిగిలిన గదులను మాత్రమే సాధారణ భక్తులకు కేటాయిస్తున్నారు. దీంతో ప్రధాన వివాహ ముహూర్తాలు ఉన్న రోజున వచ్చే భక్తులకు వసతి గదులు లభించే అవకాశం అంతంత మాత్రమే. శ్రావణ మాసం అంతా వర్షాకాలం కావడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది.



రత్నగిరిపై పెళ్లి బృందాల సందడి (ఫైల్)



ఎంఎస్ రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదిక



అన్నవరం దేవస్థానం

డిమాండ్ పెరిగి..

సత్యగిరిపై పారిశ్రామికవేత్త, విశాఖపట్నానికి చెందిన దాత ఎంఎస్ రెడ్డి నిర్మించిన ఎంఎస్ రెడ్డి అంజనీ వివాహ వేదిక, పెద్దాపురానికి చెందిన పారిశ్రామికవేత్త, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన దాత మట్టే శ్రీనివాస్ నిర్మించిన శ్రీసత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మండపాల్లోని 24 ఉచిత కల్యాణ మండపాలు ఉన్నాయి. ఈ రెండు మండపాల్లో ఏకకాలంలో 24 వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఆరు గంటల వ్యవధిలో రెండు ముహూర్తాలు ఉంటే ఒకేరోజు కల్యాణ మండపంలో రెండేసి వివాహాలు చొప్పున 48 వివాహాలు కూడా ఇక్కడ జరుగుతున్నాయి. పేద, మధ్యతరగతి వారికి ఈ మండపాలు చాలా సౌలభ్యంగా ఉంటున్నాయి. ఇక్కడ వివాహాలకు ఏ విధమైన రుసుం చెల్లించే అవసరం లేదు. పైగా పెళ్లిపీటలు, కుర్చీలు తదితర సామగ్రి దాతలు సమకూర్చుతుండడంతో ఇక్కడ వివాహాల మండపాల కోసం వీఐపీలు కూడా సిఫార్సులు చేస్తున్నారు. అయితే పేదలకు మాత్రమే ఇవ్వాలన్న ఉద్దేశంతో తెల్లరేషన్ కార్డు వారికి మాత్రమే కేటాయిస్తున్నారు.

రత్నగిరిపై కల్యాణ మండపాలు, రుసుములు

- సీతారామ సత్రం హాల్స్.. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ : రూ.8,900 చొప్పున
- సీతారామ సత్రం హాల్, సెకండ్ ఫ్లోర్: రూ.7,220
- విష్ణుసదన్ హాల్స్–14 (పెద్దవి): రూ.8,900
- విష్ణుసదన్ హాల్స్– 28 (చిన్నవి): రూ.5,540

వివాహాలు జరిగే ప్రాంగణాలు

- సీతారామ సత్రం స్టేజ్: రూ.6,100
- సెంటినరీ కాటేజీ స్టేజ్‌లు– రెండు: రూ.5,600 చొప్పున
- హరిహరసదన్ ఓపెన్ ప్లేస్: రూ. 59,500
- హరిహరసదన్ ఎడమ వైపు ప్లేస్: రూ.30 వేలు
- న్యూసీసీ ఓపెన్ ప్లేస్‌లు (3): రూ. 12,300 చొప్పున
- ప్రకాష్ సదన్ దక్షిణ వైపు రోడ్: రూ.30 వేలు
- కొండ దిగువన సత్యనికేతన్ స్థలం: రూ.1,680

తండ్రి మందలించడంతో..



మిర్తిపాడు - బొబ్బిల్లంక తొర్రిగెడ్డ కాలువలో గాలింపు చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

- ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి
- తొర్రిగెడ్డ కాలువ వద్ద అతని సైకిల్



పిప్పళ్ల రాంబాబు (ఫైల్)

సీతానగరం: బయటకు వెళ్లి ఆటలాడుతున్నాడని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన కుమారుడు ఇంటి నుంచి వెళ్లి పోయాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో అంతా గాలించగా బొబ్బిల్లంక- మిర్తిపాడు తొర్రిగెడ్డ కాలువ కల్వర్టు వద్ద అతని సైకిల్ కనిపించింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ల రాంబాబు (15) కాతేరులోని ఓ స్కూల్లో 10వ తరగతి చదువుతూ హాస్టల్లో ఉంటున్నాడు. మూడు రోజులు సెలవులపై తన ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇంటి బయట ఆడుకోవడానికి వెళ్లడంతో తండ్రి వెంకటపతి మందలించాడు. దీంతో కోపగించి సైకిల్‌పై రాంబాబు బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి వెంకటపతి, తల్లి దుర్గ, తమ్ముడు దిలీప్ బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. రాంబాబు సైకిల్‌పై బొబ్బిల్లంక రోడ్డుకు వెళ్లాడని సెంటర్‌లో కూర్చున్న కొంతమంది వెంకటపతికి తెలిపారు. బొబ్బిల్లంక- మిర్తిపాడు మధ్యలో తొర్రిగెడ్డ కాలువపై ఉన్న కల్వర్టు వద్ద అతని సైకిల్ కనిపించింది. విద్యార్థి రాంబాబు కాలువలోకి దిగి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక మరేమైనా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఎస్సై రామకృష్ణ, ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌లు బొబ్బిల్లంక రేవులో ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో సోమవారం ఉదయం తొర్రిగడ్డ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

డైట్ లెక్చరర్ కొమ్ములకు పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్) సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణకు శ్రీమక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి బాల సాహిత్య పురస్కారం లభించింది. విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కుటికుప్పల సూర్యారావు, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మక్కెన శ్రీను, విశాఖ సంస్కృతి సంపాదకులు శిరేల సన్యాసిరావు, ప్రముఖ రచయితలు జి.రాజారామ్మోహనరావు, ఎంవీ రామిరెడ్డి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. బాలసాహిత్య పురస్కారం కింద రూ.7 వేలు, మెమెంటో, శాలువాతో సత్కరించారు.



బాల సాహిత్య పురస్కారం అందుకుంటున్న లెక్చరర్ సూర్యనారాయణ

ఏవీ నగరం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ అర్హత



ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ సాధించిన ఏవీ నగరం పీహెచ్‌సీ, వైద్యులు, సిబ్బంది

తొండంగి: రోగులకు ఉత్తమ సేవలందించడంతో పాటు, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం నిర్వహణలో ఏవీ నగరం పీహెచ్‌సీ ఉత్తమ స్థానంలో నిలిచి, నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ అర్హత సాధించిందని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. జాతీయ హెల్త్‌మిషన్, నేషనల్ హెల్త్ సిస్టమ్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్‌క్యూఏఎస్ బృందం ఈ నెల ఆరున రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పీహెచ్‌సీలను సందర్శించింది. ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగులకు అందించిన సేవలతో పాటు, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, ఫార్మసీ విభాగంలో రోగులకు మందుల పంపిణీ, ఆస్పత్రి ప్రాంగణంలో పచ్చదనం నిర్వహణ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ప్రసూతి విభాగం, జాతీయ హెల్త్ మిషన్ కార్యక్రమాల నిర్వహణ, రక్తపరీక్షల విభాగం తదితర అంశాలను పరిశీలించింది. పీహెచ్‌సీల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన బృందం కాకినాడ జిల్లాలో ఉత్తమ పీహెచ్‌సీగా ఎంపిక చేస్తూ 88.08 శాతం మార్కులు సాధించిందని రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌ను సాధించిందన్నారు. ఆస్పత్రి వైద్యాధికారి పి.రవి కుమార్, వైద్యులు పి.భారతి, ఇతర సిబ్బందిని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జే.నరసింహ నాయక్ అభినందించారు. ఇటీవల తొండంగి మండలంలోని బెండపూడి–1 విలేజ్ క్లినిక్ ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ సాధించిన విషయం విదితమే.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి అండర్-11 చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం విక్టరీ అకాడమీలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–11 చెస్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. దీనికి జిల్లాలోని దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ముగ్గురు, బాలికల నుంచి ముగ్గురు చొప్పున విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. బాలుర విభాగం నుంచి పీడీఎస్ కార్తీక్ (ప్రథమ), చింతపల్లి జగదీష్ (ద్వితీయ), కనకాల విద్వేష్ (తృతీయ), బాలికల విభాగం నుంచి గెద్దాడ అక్షయ (ప్రథమ), బి.బ్లెస్సీ (ద్వితీయ), నూకపెయ్యి హన్విక (తృతీయ) స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరు ఈ నెల 27న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్–11 చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ వెల్లడించారు.

బాధిత కుటుంబానికి చేయూత

బిక్కవోలు: స్థానిక మినీ గూడ్స్ వ్యాన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు ఎం.నాని ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు సోమవారం బిక్కవోలులో బాధిత కుటుంబానికి ఆ యూనియన్ సభ్యులు రూ.1,11,000 సాయం చేశారు. సభ్యులంతా కలసి పైమొత్తం సేకరించి అందించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పేకేటి శివనారాయణ, షేక్ సైదాల్, పంపన ప్రసాద్, తాళ్లపూడి ప్రకాష్, జంగా విజయ్‌రెడ్డి, గుణ్ణం రమేష్, పైడాది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాని కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న యూనియన్ సభ్యులు

పుల్లేటికుర్రు సర్పంచ్ చెక్ పవర్ రద్దు


అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా 15వ ఆర్థిక సంఘ నిధులు డ్రా చేసిన పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా పూర్తి అదనపు బాధ్యత గ్రామ పంచాయతీ అధికారి నుంచి లిఖిత పూర్వక ఉత్తర్వులు అందినట్లు పంచాయతీ కార్యదర్శి వీవీ రమణ సోమవారం తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులను నిబంధనల ప్రకారం ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్ ద్వారా పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) అకౌంట్ నుంచి నేరుగా పనులు చేసిన కాంట్రాక్టర్ల అకౌంట్‌కు చెల్లింపులు చేయాలని రమణ తెలిపారు. ఇందుకు విరుద్ధంగా సర్పంచ్ రూ.6.54 లక్షల్లో కొంత మొత్తాన్ని చెక్కు ద్వారా చెల్లించడంతో పాటు మిగిలిన మొత్తాన్ని చెక్కు ద్వారా బ్యాంకు నుంచి డ్రా చేశారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ఈ విషయమై సర్పంచ్ బాలరాజుకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారని, దీనిపై సరైన సమాధానం రాకపోవడంతో పై విధంగా ఉత్తర్వులు ఇచ్చారని రమణ తెలిపారు.

అంతకంతకూ తగ్గుతూ..

- కర్ర పెండలం సాగుకు రైతులు దూరం
- ఏటా తగ్గుతున్న విస్తీర్ణం
- లాభసాటి వ్యవసాయంపై దృష్టి

సామర్లకోట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెట్ట రైతుల కల్పతరువు కర్ర పెండలం సాగు. ఇది అంతకంతకూ తగ్గుతూ వస్తోంది. సాగులో లాభాలు రాక విస్తీర్ణం నానాటికీ దిగజారుతోంది. 1960వ ఏడాది నుంచి 2010 వరకూ ఈ సాగు సిరులు కురిపించింది. ప్రతి ఏడాది సాగు తగ్గిపోవడంతో పంట ముగింపు దశకు వచ్చిందనే వాదనలు వినిపిస్తున్నాయి. పదేళ్లుగా పెరగని ధరతో రైతులు పంట సాగుపై విముఖత చూపి, లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ దుంప సాగు ఉమ్మడి జిల్లాలో మొత్తం 18 మండలాల్లో ఉండేది. ప్రధానంగా సామర్లకోట, పెద్దాపురం, రంగంపేట, జగ్గంపేట, ఏజెన్సీ రాజవొమ్మంగి, గంగవరంలో ఎక్కువగా సాగవుతోంది. మిగిలిన మండలాల్లో అరకొరగా దుంప పండిస్తున్నారు.

గతంలో మొత్తం 50 వేల నుంచి 60 వేల ఎకరాల్లో సాగయ్యేది. గత ఏడాది 8 వేల ఎకరాలకు తగ్గగా, ప్రస్తుతం ఐదు వేల ఎకరాలకు పడిపోయిందని అధికారులు చెబుతున్నారు. జూన్ నెలాఖరు నుంచి దుంప నాట్లు ప్రారంభమయ్యాయి. గత ఏడాది పుట్టు (225 కిలోలు)కు రూ.1,600 ఇస్తామని చెప్పిన సగ్గు బియ్యం మిలర్లు ఆ మొత్తం ఇవ్వడానికి ముందుకు రాక రైతుల పోరాటంతో పుట్టుకు రూ.1,500 అతికష్టంపై ఇచ్చారు. దుంప నుంచి సగ్గు బియ్యం చేసే మిల్లులు మాత్రం సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం మండలాల్లో ఎనిమిది మాత్రమే ఉన్నాయి. ఇందులో అధికంగా సామర్లకోట మండలంలోనే సగ్గు బియ్యం మిల్లులు నడుస్తున్నాయి.



పెద్దాపురంలో దుంప నారుకు ఎరువు వేస్తున్న రైతులు



మర్రిపూడిలో నాట్లకు సిద్ధం చేస్తున్న దుంప కర్ర విత్తనం

తగ్గిపోతున్న దిగుబడి

మెట్ట ప్రాంత సాగుగా పేరొందిన దుంప ఎకరానికి 30 నుంచి 40 పుట్లు దిగుబడి వచ్చేది. అయితే పంట మార్పిడి చేయకపోవడంతో ఎకరానికి 20 పుట్లు మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు. పదేళ్లుగా పెట్టుబడులు, భూమి కౌలు పెరిగినా సగ్గు బియ్యం మిలర్లు దుంప ధర పెంచక గిట్టుబాటు కాని వ్యవసాయం చేయలేమని చెబుతున్నారు. గతంలో 60 వేల ఎకరాల్లో ఉన్న దుంప సాగు 2015 నాటికి 30 వేలకు, 2018 నాటికి 20 వేలకు, 2020కి 15 వేలకు, ప్రస్తుతం ఐదు వేల ఎకరాలకు పడిపోయింది. మిగతా రైతులు ప్రత్యామ్నాయంగా పామాయిల్ తోటలు వేస్తున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



కర్ర పెండలం పంటకు ఆధునిక వంగడాల కొరత వేధిస్తుంది. నాణ్యమైన విత్తనం ఉంటే ఎకరానికి 50 నుంచి 60 పుట్ల దుంప దిగుబడి వస్తోంది. పెద్దాపురంలో దుంప పరిశోధనా కేంద్రాన్ని పోరాటాలు చేసి సాధించుకున్నాం. ప్రస్తుతం ఎకరానికి 25 నుంచి 30 పుట్లకు మించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సగ్గు బియ్యం కొనుగోలు చేసి మిలర్లకు భరోసా ఇవ్వడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది.

–పుట్టా సోమన్న చౌదరి, దుంప రైతు సంఘ పూర్వ అధ్యక్షుడు, మర్రిపూడి

కనీస ధరకు విత్తనాలు



పెద్దాపురం దుంప పరిశోధనా కేంద్రంలో ఆధునిక దుంప విత్తనం సమృద్ధిగా ఉంది. ఎస్సీ రైతులకు ఉచితంగా, మిగిలిన వారికి కనీస ధరకు అందజేస్తున్నాం. ఆధునిక వంగడాలతో ఎకరానికి 40 పుట్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 2,740 ఎకరాల్లో దుంప నాట్లు వేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఐదు వేల ఎకరాల లోపు సాగు జరిగే అవకాశం ఉంది. దుంప సాగు లాభసాటిగా లేక బోర్లున్న రైతులు అపరాలు, పామాయిల్, జామ, బొప్పాయి పంటలు వేస్తున్నారు.

–ఎస్.సుజాత, దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త, పెద్దాపురం